ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
పార్వతీపురం మన్యం
జిల్లా వార్తలు
ఆదివారం 12 అక్టోబరు 2025



అవే 'కీలు'కం

- కీళ్ల వ్యాధులతో జాగ్రత్త
- ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే మంచిది
- నేడు ప్రపంచ ఆర్థరైటిస్ దినం

6లో



గిరిజన విద్యాశాఖ గాడిలోపడేనా?



డీడీ విజయశాంతి



కురుపాం గిరిజన గురుకుల బాలికల పాఠశాల

- డీడీగా విజయశాంతి బాధ్యతల స్వీకరణ
- సమస్యలను దాచేస్తున్న కొందరు వార్డెన్లు
- విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం
- మెనూ సక్రమంగా అమలు చేయాలి

పార్వతీపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం ఐటీడీఏ గిరిజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా విజయశాంతి శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె ఎన్టీఆర్ జిల్లాలో డీటీడబ్ల్యూవోగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. గతంలో డిప్యూటీ డైరెక్టర్‌గా రుక్మండయ్య పని చేశారు. ఆయన తర్వాత పలువురు ఇన్‌చార్జి డీడీలుగా నియామకమై విధులు నిర్వహించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి డీడీగా కృష్ణవేణి పనిచేశారు. ఎఫ్ఏసీ హోదాలో డీడీగా విజయశాంతి బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఆమె కురుపాం గురుకుల పాఠశాల, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించారు. ఇకపై సాలూరు ఏటీడబ్ల్యూవోగా కూడా ఆమె విధులు నిర్వహించనున్నారు.

కారణం ఇదేనా?

కురుపాం గిరిజన సంక్షేమ గురుకుల బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో ఇటీవల పదుల సంఖ్యలో విద్యార్థినులు పచ్చకామెర్ల బారినపడిన విషయం తెలిసిందే. మంత్రులతో పాటు ఉన్నతాధికా రులు ఈ పాఠశాలను సందర్శించి విద్యార్థినుల సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై దృష్టిపెట్టారు. రెగ్యులర్ డీడీని నియమిస్తే గిరిజన విద్యాశాఖపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టడంతో పాటు ఇటువంటి సమస్యలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా ఉంటాయని ప్రభుత్వం ఆలోచన చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి డీడీగా విజయశాంతిని నియమించిందనే ప్రచారం జరుగుతోంది.

సరిదిద్దాలి..

డీడీగా బాధ్యతలు స్వీకరించిన విజయశాంతి గిరిజన విద్యాశాఖను పూర్తిస్థాయిలో గాడిలో పెట్టాల్సిన (మిగతా 8వ పేజీలో..)



బడుల్లో సోలార్ కాంతులు

- పీఎం శ్రీ పథకం కింద మూడు పాఠశాలల్లో పలకలు ఏర్పాటు
- విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు
- త్వరలో ప్రారంభంకానున్న పనులు
- విద్యార్థులకు తప్పనున్న కరెంటు కష్టాలు

సీతంపేట రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో సోలార్ కాంతులు విరజిల్లనున్నాయి. బడుల్లో సోలార్ పలకలను అధికారులు ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేయనున్నారు. తద్వారా విద్యార్థులకు కరెంట్ కష్టాలు తప్పడంతో మిగులు విద్యుత్‌ను అమ్మడం వల్ల పాఠశాలలకు ఆదాయం సమకూరనుంది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు పాఠశాలల్లో మౌలిక సౌకర్యాల కల్పనే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తోన్నాయి. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎం శ్రీ) పథకాన్ని 2022లో ప్రవేశపెట్టింది. ఈ పథకం పాఠశాలల పాలిట వరంలా మారింది. దీనికి ఎంపికైన పాఠశాలలను ఆదర్శంగా మార్చడానికి ఇప్పటికే అధికారులు ప్రణాళికలు తయారు చేసి అమలు చేస్తున్నారు. దీనిలో భాగంగా సీతంపేట ఐటీడీఏ పరిధిలోని మూడు పాఠశాలలు పీఎం శ్రీకి గతంలో ఎంపికయ్యాయి. ఈ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం తరగతి గదుల నిర్మాణం, వసతులు కల్పన, బోధ నా సదుపాయాలు (నాణ్యమైన విద్య), సాంకేతికతకు అనుగుణంగా ఆధునిక విద్యలో తర్ఫీదు వంటివి అధికారులు అందించనున్నారు. అలాగే, సోలారు పలకలను ఏర్పాటు చేసి విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.

ఐటీడీఏ పరిధిలో ఇలా..

ఉమ్మడి జిల్లాలో పీఎం శ్రీ పథకానికి సీతంపేట ఏపీఆర్ బాలుర గురుకుల పాఠశాల, బొమ్మిక, వెన్నెలవలస ఆశ్రమ పాఠశాలలు ఎంపికయ్యాయి. ఈ పాఠశాలల్లో మొత్తం వెయ్యి మందికి పైగా గిరిజన విద్యార్థులు చదువుతున్నారు. ఈ పథకం కింద పాఠశాలల్లో మొదటి విడతగా అదనపు భవనాల నిర్మాణాలకు ఇప్పటికే అధికారులు ప్రతిపాదనలు పంపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భవన నిర్మాణాలకు సంబంధించి నిధులు కూడా మంజూరు కావడంతో త్వరలో పనులు ప్రారంభంకానున్నాయి. అలాగే, ఈ మూడు పాఠశాలల్లో సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. సోలార్ యూనిట్ల ఏర్పాటు వల్ల విద్యుత్ బిల్లుల భారాన్ని వదిలించుకోవడంతో పాటు అదనంగా వచ్చే విద్యుత్‌ను అమ్మడం ద్వారా ఆయా పాఠశాలలకు ఆదాయం సమకూరనుంది. ఒక్కో పాఠశాలలో 3.25కిలోవాట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి చేసేలా అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. త్వరలో సోలార్ విద్యుత్ పలకలను అమర్చనున్నారు. దీంతో ఆయా పాఠశాలల్లో నిరంతరం వెలుగులు రానున్నాయి. ఈ విషయమై డిప్యూటీ డైరెక్టర్ (టీడబ్ల్యూ)ఎం.అన్నదొరను వివరణ కోరగా.. పాఠశాలల్లో సోలార్ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి తమకు ఇంకా సమాచారం అందలేదని అన్నారు.

వైద్యం ఎలా?

- 12 ఆస్పత్రుల్లో వైద్యులు, సిబ్బంది కొరత
- ఉన్నవారిపై పనిభారం
- రోగులకు అంతంతమాత్రంగా సేవలు





రాజాం ఆస్పత్రి

రాజాం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజన్లవారీగా వ్యాధులు ముసురుకుంటున్నాయి. వైరల్ జ్వరాలు, దగ్గు, జలుబు వంటి వాటితో అనేక మంది ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో డయేరియా, పచ్చకామెర్లు వంటివి సోకుతున్నాయి. ఈ సమయంలో ప్రజలు సీహెచ్‌సీలు, ప్రాంతీయ ఆస్పత్రుల వైపు చూస్తున్నారు. కానీ అక్కడ వైద్యులు, సిబ్బంది కొరత ఉండడంతో వైద్యసేవలు సంతృప్తిగా పొందలేకపోతున్నారు. ప్రధానంగా వైద్య విధాన పరిషత్ పరిధిలో పనిచేస్తున్న 12 ఆస్పత్రుల్లో సిబ్బంది పూర్తిస్థాయిలో లేరు. ఉన్న సిబ్బందికి ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. పనిభారం పడుతోంది.

ఉమ్మడి జిల్లాలో వైద్య విధాన పరిషత్ పరిధిలో పార్వతీపురం, ఎస్.కోట, సాలూరు, రాజాం, పాలకొండ ఏరియా ఆస్పత్రులు ఉన్నాయి. వీటితో పాటు గజపతినగరం, బాడంగి, భోగాపురం, నెల్లిమర్ల, చీపురుపల్లి, బొబ్బిలి, కురుపాం, భద్రగిరి, చినమేరంగి సీహెచ్‌సీలు ఉన్నాయి. అయితే ఈ ఆస్పత్రుల పరిధిలో 198 మంది వైద్యులు ఉండాలి. కానీ ఉన్నది కేవలం 168 మంది మాత్రమే. దీంతో 30 మంది వైద్యుల కొరత ఉంది. అయితే ఉన్న వైద్యుల్లో సైతం ఉన్నత చదువులు, మహిళా వైద్యులు వివిధ అవసరాల కోసం దీర్ఘకాలిక సెలవులపై ఉన్నారు. దీంతో ఉన్న కొద్దిపాటి మందిపై భారం పడుతోంది. రోగుల వైద్యసేవలపై ప్రభావం చూపుతోంది. ప్రధానంగా ఈఎన్‌టీ, సైకాలజీ, పిడియాట్రిక్, రేడియాలజీ, ఫోరెన్సిక్, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, ఆర్థో, గైనకాలజీ, అప్తాలమిక్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మత్తు వైద్యుల కొరత సైతం వేధిస్తోంది. దీంతో ఆపరేషన్లు, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల సమయంలో ఇతర ఆస్పత్రుల నుంచి మత్తు వైద్యులను తెప్పించుకోవాల్సి వస్తోంది.

పారా మెడికల్ సిబ్బంది సైతం..

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యులతో పాటు ఇతర సిబ్బందిదీ కీలక పాత్ర. పారా మెడికల్ సిబ్బంది ఉంటేనే రోగులకు సక్రమంగా వైద్యసేవలందుతాయి. కానీ కొన్నేళ్లుగా పారా మెడికల్ సిబ్బంది నియామకం (మిగతా 8వ పేజీలో..)

కొరత వాస్తవమే..

కొన్ని ఆస్పత్రుల్లో వైద్యుల కొరత ఉన్న మాట వాస్తవమే. ఉన్నవారితో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నాం. పారా మెడికల్ సిబ్బంది కొరతను సైతం అధిగమిస్తున్నాం. ఇదే విషయాన్ని ప్రభుత్వానికి నివేదించాం. త్వరలో పెండింగ్ పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉంది.

- జీవనరాణి, డీఎంహెచ్‌వో, విజయనగరం

అధిక రాబడి వచ్చే పంటలను సాగుచేయండి

- కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

పార్వతీపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు అధిక రాబడి వచ్చే పంటలను సాగు చేయాలని కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. పీఎం ధనధాన్య కృషియోజన, పప్పుధాన్యాల ఆత్మ నిర్భరత పథకాలను ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శనివారం ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జిల్లా వ్యవసాయాధికారి, ఇతర అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి రైతులతో మాట్లాడుతూ.. అధిక దిగుబడి, అధిక లాభాలు వచ్చే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు పండించాలన్నారు. పామ్ ఆయిల్, కొబ్బరి, ఫూల్‌మఖానా, చెస్‌నట్స్ వంటి పంటలతో పాటు అంతర పంటల సాగువల్ల మరింత ఆదాయం పెరుగుతుందన్నారు. రైతులు చిన్నపాటి మార్పులు చేసుకోవడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చునని అన్నారు. పొలం గట్లపై కందులు, కూరగాయలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్ డైరెక్టర్ డి.శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయాధికారి కె.రాబర్ట్‌పాల్, ఉద్యానవనశాఖాధికారి కె.క్రాంతికుమార్, ప్రకృతి వ్యవసాయ అధికారి శ్రావణ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

కదలని ఏనుగులు

- లక్ష్మీనారాయణపురంలో తిష్ఠ
- పంటలకు నష్టం



లక్ష్మీనారాయణపురంలో సంచరిస్తున్న ఏనుగులు

పార్వతీపురం రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మీనారాయణపురం ప్రాంతంలో ఏనుగులు తిష్ఠ వేశాయి. కొన్ని రోజులుగా గ్రామ పరిసరాల్లో సంచరిస్తూ పంటలను నాశనం చేస్తున్నాయి. గ్రామ సమీపంలోనే ఏనుగులు ఉండడం వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. తమపొలాలను చూసేందుకు కూడా వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. మొక్కజొన్న, వరి తదితర పంటలు పాడవుతున్నాయని అంటున్నారు. ఈ సంవత్సరం పంట చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు స్పందించి ఏనుగులను ఇక్కడ నుంచి తరలించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి



పిల్లలతో మాట్లాడుతున్న జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

కురుపాం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. శనివారం కురుపాం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణ, మినరల్ వాటర్ ప్లాంట్, మరుగుదొడ్లు, వసతి గృహం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి వారి ఆరోగ్య గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయాలని హెచ్‌ఎం, వైద్య సిబ్బందిని ఆదేశించారు. అనంతరం దుడ్డిఖల్లు, దొరజమ్ము, రేగిడి, టిక్కబాయి, పి.ఆమిటి గిరిజన సంక్షేమ వసతి గృహాలను జేసీ పరిశీలించారు.

పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతాం..

గరుగుబిల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తోటపల్లి భారీ సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని కుడి ప్రధాన మట్టికట్ట ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు జాయింట్ కలెక్టర్ పి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శనివారం నుంకి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న పార్వతీపురం ఐటీడీఏ పార్కును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్కును అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. పార్కుకు ఆనుకుని ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని ఐటీడీఏ జేఈ తిరుపతి రావు, వాటర్ షెడ్ ఏపీవో రెడ్డి సురేష్‌కుమార్‌ను ఆదేశించారు. సెలవు దినాల్లో పర్యాటకులు, చిన్నారులు పార్కును వీక్షించేందుకు అనువుగా ఉం డేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆట పరికరాలు, సామగ్రిని అందుబాటులో ఉంచాలన్నారు. సుందరీకరణ పనులు నిర్వహించాలన్నారు. నదిలో బోటు షికారుపై దృష్టిసారించాలన్నారు. కార్తీకమాసం సమయానికి పూర్తి స్థాయిలో అభివృద్ధి పనులు నిర్వహించాలని సూచించారు.

- బాలికలు భారం కాదు
  - మంత్రి శ్రీనివాస్ 6లో
- విద్యుత్ వినియోగదారులతో వాట్సాప్ గ్రూపులు
  - ఏఈ రఘు 6లో
- గంజాయి రవాణాపై దృష్టి
  - ఎస్పీ ఏఆర్ దామోదర్ 6లో
- చీపురుపల్లిలో చోరీ
  - పది తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ.2.5లక్షల నగదు అపహరణ 7లో

మైదానాలు కాదు.. చెరువులే



పాలకొండ-వీరఘట్టం రోడ్డులో ఉన్న వెంకటరాయుని చెరువు

ఈ ఫొటోలను చూసి మైదానాలు అనుకునేరు. ఇవీ పాలకొండ నగర పంచాయతీ పరిధిలోని వెంకటరాయుని, కిష్టప్ప చెరువులు. గత కొన్నేళ్లుగా పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్క పేరుకుపోయి మైదానాల మాదిరిగా తయారయ్యాయి. ఎంతో చరిత్ర కలిగిన వెంకటరాయుని చెరువులో స్థానికులు చెత్తా చెదారాలను పారబోస్తున్నారు. దీనికితోడు గుర్రపుడెక్క, నాచు, ఇతర పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగి పచ్చిక బయళ్లను తలపిస్తోంది. చెరువులోని చెత్తాచెదారం తొలగించి మత్స్యకార సంఘాలకు చేపలు వేసేందుకు బహిరంగ వేలం వేసినా నగర పంచాయతీకి కొంత ఆదాయం సమకూరుతుందనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. అదే విధంగా 40 ఎకరాల విస్తీర్ణం గల కిష్టప్ప చెరువుది కూడా ఇదే పరిస్థితి. ఈ చెరువు ఆక్రమణకు గురవుతుండడంతో పాటు పిచ్చిమొక్కలు, గుర్రపు డెక్క పేరుకుపోయాయి. చెరువు పక్క నుంచి వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా నగర పంచాయతీ యం త్రాంగం స్పందించి ఈ రెండు చెరువులను బాగుచేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. - పాలకొండ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి)



పాలకొండ పట్టణంలోని కిష్టప్ప చెరువు

● కీళ్ల వ్యాధులతో జాగ్రత్త

● ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే మంచిది ● నేడు ప్రపంచ ఆర్థరైటిస్ దినం

అవే కీలుకం



విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి)

ఒకప్పుడు వృద్ధులకు మాత్రమే పరిమితమైన కీళ్ల నొప్పులు...ఇటీవల కాలంలో మధ్య వయస్కులు, యువతను కూడా వేధిస్తున్నాయి. ఒకప్పుడు వయస్సు పెరిగే సందర్భంలో వచ్చే ఆర్థరైటిస్ ఇప్పుడు జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ఒత్తిడి, వ్యాయామం లేకపోవడం వంటి కారణాలతో అన్ని వయస్సుల వారినీ వేధిస్తోంది. కీళ్లను క్రమంగా బలహీనపరుస్తూ... శరీరాన్ని కదలలేని స్థితిలోకి నెట్టే ఈ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే నియంత్రణ సాధ్యమవుతుందని వైద్యులు చెబుతున్నారు.



ఆర్థరైటిస్ అంటే..

కీళ్లలో వాపు, నొప్పి కలిగించే స్థితి. ఇది ఒక్కరోజులో రాకపోయినా ఏళ్ల తరబడి శరీరంలోని కార్టిలేజ్ అనే కీళ్ల రక్షణ పొర చెదిరిపోవడం వల్ల నొప్పులు మొదలవుతాయి. ప్రధానంగా ఆస్టియో ఆర్థరైటిస్, రుమటాయిడ్ ఆర్థరైటిస్ రెండు రకాలుగా ఉంటాయి. మొదటిది వయస్సు పెరగడం వల్ల వస్తే, రెండోది రోగ నిరోధక వ్యవస్థలో లోపం వల్ల శరీరం తన కీళ్లపై తానే దాడి చేయడం వల్ల వస్తుంది. ప్రధానంగా ఉప్పు, ఎక్కువ పిండి పదార్థాలు, డ్రీప్ ఫ్రైడ్ ఆహారం తీసుకోవడం., వంశపారంపర్యం, ఒబేసిటీ, కీళ్లకు గాయాలు, హార్మోన్లలో మార్పుల వంటి కారణాల వల్ల ఆర్థరైటిస్ రావచ్చును.

ఆస్ట్రియో ఆర్థరైటిస్..

ఇది వయస్సు, అధిక బరువు, గాయాల వంటి కారణంగా వచ్చే కీళ్ల వ్యాధి. దీని వల్ల మోకాళ్ల నొప్పి, మెట్లు ఎక్కేటప్పుడు, కూర్చుని లేచేటప్పుడు నొప్పి, కీళ్ల గట్టిపడడం, క్రాక్ లాంటి శబ్దం రావడం, నడకలో తడబాటు, కీళ్ల కదలిక తగ్గిపోవడం వంటి లక్షణాలు కలుగుతాయి.

రుమటాయిడ్ ఆర్థరైటిస్..

రోగ నిరోధక వ్యవస్థ తప్పుడు సంకేతాల వల్ల తన కీళ్లపై తానే దాడి చేస్తుంది. కీళ్ల చుట్టూ ఉండే పొరల్లో వాపు ఏర్పడి క్రమంగా ఎముకలు, కార్టిలైజ్ దెబ్బతింటాయి. ఉదయం లేచినప్పుడు చేతులు, వేళ్ల కీళ్ల గట్టిపడడం, నొప్పి, వాపు రావడం, కీళ్లు ఎర్రగా, వేడిగా మారడం, శరీరంలో అలసట, బలహీనత, వేళ్ల ఆకారం మారిపోవడం, వంగిపోవడం, కీళ్లు కదలించలేకపోవడం, ఆకలి మందగించడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.


జాగ్రత్తలు తప్పనిసరి..

ఆర్థరైటిస్‌కు దూరంగా ఉండాలంటే... బరువును నియంత్రణలో ఉంచుకోవాలి. అలాగే సమతుల ఆహారమైన కూరగాయలు, పండ్లు, అల్లం, పసుపు, వెల్లుల్లి, రాగులు వంటివి ఆహారంలో చేర్చుకోవాలి. రోజుకు 30నిమిషాలు నడక లేదా యోగా చేయడం వంటివి అవసరం.

● చలికాలంలో కీళ్ల నొప్పులు ఎక్కువగా ఉంటాయి. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి

● నిపుణుల సూచనల మేరకు ఫిజియోథెరపీ వంటి వ్యాయామాలు చేయించుకోవాలి.

● ఒత్తిడి కూడా ఇమ్యూన్ వ్యవస్థను ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో ధ్యానం, ప్రాణాయామం ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి.



ఆర్థరైటిస్‌కు ఆధునిక చికిత్సలు..

ఆర్థరైటిస్‌కు ప్రస్తుతం ఆధునిక చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. అధునాతన బయోలాజికల్ ఇంజక్షన్లు, కార్టిసెల్ థెరపీ కూడా అందుబాటులో ఉన్నాయి. ఆర్థరైటిస్ లక్షణాలు కనిపిస్తే... నిర్లక్ష్యం చేయకుండా వైద్య నిపుణులను సంప్రదించాలి. పరీక్షల ద్వారా ఏ రకమైన ఆర్థరైటిస్ ఉందో నిర్ధారణ చేస్తాం. రుమటాయిడ్ ఆర్థరైటిస్‌కు నేడు ఆధునిక చికిత్స అందుబాటులో ఉంది. ఆస్ట్రియో ఆర్థరైటిస్ వచ్చిన తరువాత వైద్యుల సలహాతో తగిన జాగ్రత్తలు పాటిస్తూ వ్యాధి పెరగకుండా ఆపవచ్చు.

-డాక్టర్ పవన్ కుమార్,
ఆర్థోపెడిక్ సర్జన్, విజయనగరం

విద్యుత్ వినియోగదారులతో

వాట్సాప్ గ్రూపులు

● సమస్యలకు తక్షణ పరిష్కారం ● ఏఈ రఘు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



బొబ్బిలి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బొబ్బిలి విద్యుత్ డివిజన్‌లో అమలు చేస్తున్న విద్యుత్, సౌర విద్యుత్ పథకాలు, వినియోగదారులకు అందిస్తున్న సేవలు తదితర అంశాలను ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు బి.రఘు 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు. వాటి వివరాలు ఆయన మాటల్లోనే...

ప్రశ్న: విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవల కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జవాబు: విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగినప్పుడు, ఇతర సాంకేతిక సమస్యలు తలెత్తినప్పుడు సిబ్బంది వినియోగదారులందరికీ అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకున్నాం. ప్రతి వంద మంది వినియోగదారులతో కలిపి సంబంధిత లైన్‌మెన్‌తో వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశాం. విద్యుత్ శాఖ కార్యకలాపాలు, మరమ్మతులు, సేవలు, అంతరాయం, సరఫరా, పునరుద్ధరణ వంటి అంశాలను ఆ గ్రూపుల్లో తెలియజేసేలా ఆదేశించాం. ఇది మంచి ఫలితాలను ఇస్తోంది. సిబ్బంది పారదర్శకంగా, బాధ్యతాయుతంగా వినియోగదారులకు సేవలు అందించ గలుగుతున్నారు. సేవల్లో నాణ్యత, వినియోగదారుల పట్ల మర్యాదను పెంపొందిస్తున్నాం. ఐవీఆర్ఎస్ ద్వారా వినియోగదారుల నుంచి సేవలకు సంబంధించి అభిప్రాయాలను సేకరిస్తున్నాం.

ప్ర: ఎస్సీ, ఎస్టీల కోసం అమలులో ఉన్న పథకాలు ఏమిటి?

జ: ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సౌరవిద్యుత్‌ను అందజేసేందుకు ప్రభు త్వం నిర్ణయించింది. పీఎం సూర్యఘర్ పథకంలో రాయితీలు కల్పించా రు. అందులో భాగంగా ఎస్సీ, ఎస్టీలు సౌర ఫలకాల ఏర్పాటు కోసం స మకూర్చే స్థలం చదరపు అడుగుకు రూపాయి చొప్పున 200 చ.అడుగుల కు నెలకు రూ.200 వంతున చెల్లిస్తాం. నెడ్‌క్యాప్ ద్వారా ఈ పథకాన్ని అమలు చేసేందుకు అవసరమైన టెండర్ల ప్రక్రియ జరుగుతోంది.

ప్ర: సౌర విద్యుత్‌కు సంబంధించి ఏ చర్యలు చేపడుతున్నారు?

జ: విద్యుత్ డివిజన్ పరిధిలో సేవాపర్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఇందులో భాగంగా ప్రతి విద్యుత్ ఉద్యోగికి, అధికారికి విడివిడిగా సూర్యఘర్ పథకం కింద కనెక్షన్ల ఏర్పాటుకు లక్ష్యాలను విధించారు. ఒక కిలో వాట్‌కు రూ.90 వేల చొప్పున రాయితీని ప్రభుత్వం అందజేస్తుంది. మిగిలిన ఖర్చును కూడా బ్యాంకు రుణాల ద్వారా అందజేస్తారు. దీని కోసం ఆరు శాతం వడ్డీని వసూలు చేస్తారు. ఒక కిలో వాట్ ద్వారా నాలుగు యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుంది. 25 సంవత్సరాల పాటు సౌరవిద్యుత్ పరికరాలకు వారెంటీ ఉంటుంది.

ప్ర: సౌరవిద్యుత్ కోసం ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు?

జ: బొబ్బిలి డివిజన్ పరిధిలో సోలార్ విద్యుత్ కోసం 1,203 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇంతవరకు 343 మందికి సౌరఫలకాలను అమర్చాం. దీనికి వినియోగదారుల నుంచి మంచి స్పందన లభిస్తోంది. ఇంకా అధికారులు, సిబ్బంది గ్రామాలకు వెళ్లి అవగాహన కల్పిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు లక్ష యూనిట్ల సౌరవిద్యుత్ ఉత్పత్తి అవుతోంది.

ప్ర: పీఎం కుసుమ పథకం వివరాలు ఏంటి?

జ: పీఎం కుసుమ పథకంలో నాలుగు ఎకరాల స్థలంలో సోలార్ విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం. ఎక్కడ ప్రభుత్వ భూములు ఉంటే అక్కడ ఏర్పాటు చేస్తాం. ప్రైవేట్ స్థలాలను లీజుప్రాతిపదికన తీసుకుని సౌర విద్యుత్ యూనిట్లు ఏర్పాటు చేస్తాం. సతివాడ, సుందరాడ, గోపాల రాయుడిపేట, గదబవలస, కొట్టక్కి, ఆరికతోట, మర్రివలస గ్రామాలలో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. ప్రైవేట్ భూములను ఎవరైనా 25 సంవత్సరా ల లీజుకు ఇస్తే సంవత్సరానికి రూ.30 వేల చొప్పున అద్దె చెల్లిస్తాం.

ప్ర: కొత్తసబ్‌స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నారా?

జ: తెర్లాం మండలం పెరుమాళిలో రూ.5 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు ప్రతిపాదించాం. దీన్ని నిర్మిస్తే బొబ్బిలి, బలిజిపేట ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు ప్రత్యామ్నాయంగా పెరుమాళి నుంచి సరఫరా చేయడానికి అవకాశం ఉంటుంది.

బాలికలు భారం కాదు

● మంత్రి కొండపల్లి శ్రీనివాస్

బొండపల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన వివిధ పథకాలను సద్వినియోగం చేసుకుంటే.. బాలికలు భారం కాదని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల వెలుగు సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జెండర్ రిసోర్స్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. మహిళలకు, బాలికలకు అన్ని విధాలా ఆసరాగా నిలిచేందుకు వెలుగు బృందాలు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఒంపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవాన్ని ఐసీడీఎస్ సీడీపీవో ఉమాభారతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజ రైన మంత్రి తొలుత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మా ట్లాడుతూ తపాలా శాఖ ప్రవేశ పెట్టిన మహిళా సమృద్ధి యోజన ఖాతాపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఉన్న 6 కుటుంబాలకు చెందిన బాలి కల పేరున సొంత నిధులు రూ.5వేల వంతున కేటాయించి ఖాతాలు ప్రారంభించారు. ఆడపిల్ల పుట్టిందని దిగులు చెందకుండా వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దేలా ప్రణాళికతో నడుచుకోవాలని సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో మమేకమై.. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా మధ్యాహ్న భోజన నిర్వహణ సక్రమంగా లేదని మంత్రి దృష్టికి విద్యార్థులు తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన సత్వరమే సమస్య పరిష్కరించకపోతే త్వరలో ఆకస్మికంగా పర్యటించి... చర్యలు చేపడతామని హెచ్చరించారు. ఏఎంసీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు పీవీవీ గోపాలరాజు, కోరాడ కృష్ణ, మండల టీడీపీ అధ్యక్షులు రాపాక అచ్చన్నాయుడు, మహిళా అధ్యక్షురాలు ముంజేటి పార్వతి, క్లస్టర్ ఇన్‌చార్జి నంబూరి రాజేష్, తహసీల్దార్ డోలా రాజేశ్వరరావు, ఎంపీడీవో గిరిబాల పాల్గొన్నారు.



ఒంపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

అనుసంధాన రోడ్లను నిర్మిస్తాం

● ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): 'నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ప్రతి రోడ్డునూ బాగుచేయిస్తాను. ప్రధాన రహదారుల సమస్యల పరిష్కారమైన అనంతరం ప్రతి గ్రామాన్ని అనుసంధానం చేసేలా రోడ్లను ఏర్పాటు చేయిస్తా'నని ఎమ్మెల్యే బేబీనాయన హామీ ఇచ్చారు. శనివారం అలజంగి-తెర్లాం రహదారి మరమ్మతు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పనులకు ప్రభుత్వం రూ. 4.50 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి అల్లాడ భాస్కరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు వాసిరెడ్డి సత్యనారాయణ, బాడంగి మండల టీడీపీ అధ్యక్షుడు తెంటు రవి, అలజంగి సర్పంచ్ ప్రతినిధి రేజేటి బుజ్జి, బడే జానీ పాల్గొన్నారు.



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

ఆకులకట్ట-పినపెంకి రోడ్డు పనులకు..

బాడంగి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఆకులకట్ట-పినపెంకి రోడ్డు పనులకు శనివారం ఎమ్మెల్యే బేబీనాయన శంకుస్థాపన చేశారు. ఈ పనులకు ప్రభుత్వం రూ.3 కోట్లను మంజూరు చేసింది. కార్యక్రమంలో సర్పంచ్ ఉయ్యాల సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యుడు పూడి సింహాచలం, పీఏసీఎస్ అధ్యక్షుడు బొంతు త్రినాథనాయుడు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టిపెట్టండి

● పీడీ శ్రీనివాసరావు

రామభద్రపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సాగులో రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (అత్మ) పీడీ ఆర్.శ్రీనివాసరావు సూచించారు. ముచ్చర్లవలసలో శనివారం వరి పంటలో సమగ్ర సస్యరక్షణ పద్ధతులపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు విధిగా యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఇష్టారాజ్యంగా రసాయన ఎరువులు వాడకం వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోవడమే కాకుండా భూసారం దెబ్బతింటుందన్నారు. పంట ఉత్పత్తిలో నాణ్యత తగ్గుతుందన్నారు. మండల వ్యవసాయాధికారి అమరా శివ మాట్లాడుతూ ప్రస్తుతం వరిపంటలో ఆకు ఎండు తెగులు, ఆకుముడత తెగులు ఆశించామన్నారు. వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. సర్పంచ్ కనిమెరక శంకరరావు, వ్యవసాయ విస్తరణాధికారి పి.వెంకటరమణ, గ్రామ వ్యవసాయ సహాయకులు బి.రాజశేఖర్, రైతులు పాల్గొన్నారు.



శిక్షణా తరగతుల్లో మాట్లాడుతున్న పీడీ శ్రీనివాసరావు



100 నెంబరుకు ఫోన్ చేస్తున్న ఎస్పీ దామోదర్

గంజాయి రవాణాపై దృష్టి

● ఎస్పీ ఏఆర్ దామోదర్ ● గంట్యాడ పోలీసు స్టేషన్ ఆకస్మిక తనిఖీ

గంట్యాడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి గంజాయి అక్రమ రవాణా చేసేందుకు అవకాశం ఉన్న ప్రధాన రహదారుల్లో ఎప్పటికప్పుడు ఆకస్మికంగా వాహనాల తనిఖీలు చేపట్టాలని ఎస్పీ ఎఆర్ దామోదర్ సిబ్బందికి సూచించారు. గంజాయి అక్రమ రవాణాను నియంత్రించేందుకు కఠిన చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి వినియోగించే స్థావరాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని స్పష్టం చేశారు. శనివారం గంట్యాడ పోలీసు స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ కారణాలతో స్వాధీనం చేసుకొని... స్టేషన్ ఆవరణలో ఉంచిన వాహనాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. డయల్ 100/110 నెంబర్లకు ఫోన్ చేసి... పోలీసులే సంఘటనా స్థలానికి వాస్తవంగా ఎంత సమయంలో చేరుకుంటున్నారోనని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు స్టేషన్‌కు వచ్చే బాధితులు, వృద్ధులు, మహిళలతో ఆప్యాయంగా మాట్లాడి, వారి సమస్యలను శ్రద్ధగా విని పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో సీజ్ చేసి, స్టేషన్ ప్రాంగణంలో పార్కింగ్ చేసి ఉన్న వాహనాలను నిబంధనలు మేరకు డిస్పోజ్ చేసి యజమానులకు అప్పగించాలన్నారు. విజయనగరం రూరల్ సీఐ బి.లక్ష్మణరావు, ఎస్ఐ సాయికృష్ణ, పోలీసు సిబ్బంది ఉన్నారు.

స్నేహపూర్వకంగా మెలగండి..

ఎస్.కోట రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలతో పోలీసులు స్నేహపూర్వకంగా మెలగాలని ఎస్పీ దామోదర్ అన్నారు. శనివారం మధ్యాహ్నం ఎస్.కోట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి... రికార్డులు చూశారు. బొడ్డవర చెక్‌పోస్టును పరిశీలించారు. గంజాయి రవాణాను మరింత సమర్థవంతంగా అడ్డుకోవాలని ఆదేశించారు. సీఐ నారాయణమూర్తి, ఎస్ఐలు చంద్రశేఖర్, సత్యనారాయణ ఉన్నారు.

వల్లంపూడిలో..

వేపాడ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వల్లంపూడి పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ ఏఆర్ దామోదర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. బ్రిటిష్ కాలంలో నిర్మించిన పాత పోలీస్‌స్టేషన్ భవనాన్ని గూర్చి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ పోలీసు స్టేషన్ల పరిస్థితులను తెలుసుకునేందుకు సాధారణంగా పర్యటిస్తున్నట్టు చెప్పారు. ఆయనతో పాటు ఎస్.కోట రూరల్ సీఐ అప్పలనాయుడు, ఎస్ఐ సుదర్శన్, సిబ్బంది పాల్గొన్నారు.

ఈ వంతెనలకు

మోక్షమెప్పుడో!

● ప్రమాదకర స్థితిలో ఉన్నవైనం

● బిక్కుబిక్కుమంటూ ప్రయాణాలు

రాజాం రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు... ఒడిశాకు అనుసంధానంగా ఉండే రహదారులపై ఉన్న కాజ్‌వేలు, వంతెనలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ప్రయాణికులు భయం భయంగా ప్రయాణాలు సాగిస్తున్నారు. రాజాం-పాలకొండ మార్గంలో గురవాం సమీపంలో కాజ్‌వే పూర్తిగా శిథిలమైంది. ఇరువైపులా రిటైనింగ్‌వాల్స్ కూలిపోయి నాలుగేళ్లయింది. ఏక్షణాన ఏం జరుగుతుందోనన్న భయంతో వాహన చోదకులు ముందుకు సాగుతున్నారు. ఇదే రోడ్డులో సంకిలి వరకూ ఉన్న మరో నాలుగు కాజ్‌వేలదీ ఇదే దుస్థితి. పాలకొండ- విశాఖ ప్రధాన మార్గంలో ఉన్న ఈ కాజ్‌వేలలో ఏ ఒక్కటి కూలినా పాలకొండ-విశాఖ మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అలాగే ఒడిశాలోని వివిధ ప్రాంతాల నుంచి పాలకొండ, రాజాం మీదుగా జైపూర్ తదితర పట్టణాలకు రాకపోకలు సాగించే ఆర్టీసీ బస్సులు సైతం నిలిచిపోయే పరిస్థితి తలెత్తుతుంది. రాజాం-శ్రీకాకుళం ప్రధాన మార్గంలో సారధి గెడ్డపై వందేళ్లనాటి వంతెన ఏయేటికాయేడు భూమిలోకి కుంగిపోతోంది. 2019లో ఈ వంతెన రెయిలింగ్‌ను లారీ ఢీకొనడంతో వంగిపోయింది. ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా నేరుగా గెడ్డలోకి వెళ్లాల్సిందే. ఒడిశాలోని బరంపురం, తదితర పట్టణాల నుంచి శ్రీకాకుళం, రాజాం మీదుగా జైపూర్ తదితర పట్టణాలకు ఈ వంతెన మీదుగా బస్సులు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఏమాత్రం తేడా వచ్చినా ప్రత్యామ్నాయ మార్గంలో వాహనాలను మళ్లించేందుకు కూ డా అవకాశాలు లేని దుస్థితి ఇక్కడ ఉంది. జిల్లాలోని చీపురుపల్లి పట్టణంలో సుమారు మూడేళ్ల క్రితం ప్రారంభించిన ఆర్వోబీ నిర్మాణం పనులు నేటికీ పూర్తికాలేదు. పాలకొండ, రాజాం, చిలకపాలెం మీదుగా విశాఖ, రాజమండ్రి, విజయవాడ తదితర ప్రాంతాలకు వందలాది వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తున్నాయి. దీంతో ఈ వంతెనపై పెనుభారం పడి ప్రమా దకరంగా మారుతోంది. అంతకాపల్లి-మొగిలివలస గ్రామాల మధ్య సారధిగెడ్డపై వందేళ్ల క్రితం నిర్మించిన వంతెన కూడా శిథిలావస్థకు చేరుకుంది. ప్రభుత్వం సకాలంలో స్పందించి... వీటి స్థానంలో కొత్తవి నిర్మించాల్సిన అవసరం ఉంది. పరిస్థితి చేయి దాటక ముందే కొత్త వంతెనలు నిర్మించాలని రెండు రాష్ట్రాల ప్రయాణికులు కోరుతున్నారు.



సారధిగెడ్డపై ప్రమాదపుటంచున వంతెన



అంతకాపల్లి-మొగిలివలస గ్రామాల మధ్య వంతెన ఇలా..



గురవాం సమీపంలో వంతెన దుస్థితి

నేడు టీడీపీ సమావేశం

విజయనగరం రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): వర్షం కారణంగా ఈనెల 9న జరగాల్సిన టీడీపీ విజయనగరం నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో జరుగనుంది. ఈ సమావేశంలో విజయనగరం నియోజకవర్గ పరిధిలో ఉన్న టీడీపీ అర్బన్, మండల కార్యవర్గాలు, అనుబంధ సంఘాల కమిటీలను ప్రకటించనున్నారు. ఈ కమిటీలు 2025 నుంచి 2027 వరకూ రెండేళ్ల పాటు బాధ్యతలు చేపట్టనున్నాయి. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అదితి గజపతిరాజు హాజరు కానున్నారు.

రేపు జీపీ అప్పారావు విగ్రహావిష్కరణ

గంట్యాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): తాటిపూడి రిజర్వాయర్ వద్ద సోమవారం ఉదయం 10 గంటలకు గొర్రిపాటి బుచ్చి అప్పారావు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. అందుకు సంబంధించి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. తాటిపూడి రిజర్వాయర్ ఏర్పాటుకు దివంగత నాయకుడు జీపీ అప్పారావు కీలక పాత్ర పోషించారు. ఆయన విగ్రహం ఏర్పాటుకు స్థానికులు ఎప్పటి నుంచి ప్రయత్నం చేస్తున్నారు. ఎట్టకేలకు విగ్రహం ఏర్పాటు జరుగుతుంది. దీనిని రాష్ట్ర ఎంఎస్ఎం ఈ, సెర్ప్, ఎన్ఆర్ఐ వ్యవహారాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆవిష్కరించనున్నారు.

పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో ఆధార్ శిబిరాలు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో ఈనెల 13, 14 తేదీల్లో నిర్వహించే ఆధార్ శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంబంధిత శాఖ ఇన్‌స్పెక్టర్ సతీష్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రెండు రోజుల శిబిరం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ అధికారి హర్ష పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఈసీఎంగా రామారావు

రాజాం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబరుగా రాజాం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ దూసి రామారావు నియమితులయ్యారు. విజయవాడలో శనివారం నిర్వహించిన ఎన్నికల్లో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు ఆయన స్థానిక విలేకర్లకు ఫోన్ ద్వారా తెలియజేశారు. ఆయనకు కళాశాల అధ్యాపకులు, సిబ్బంది అభినందనలు తెలిపారు.

ఆ వ్యవస్థ ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలి

విజయనగరం బాబామెట్ట, అక్టోబరు 11 (ఆంధ్ర జ్యోతి): పేదలకు విద్య, వైద్యం అందాలంటే ప్రభుత్వ రంగంలోనే ఆ వ్యవస్థను కొనసాగించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి శంకరరావు డిమాండ్ చేశారు. ఎల్‌బీజీ భవన్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైద్య రంగాన్ని పూర్తిగా, పీపీపీ మోడల్‌లో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టి తన బాధ్యత నుంచి తప్పుకోవడానికి చూస్తుందన్నారు. గత ప్రభుత్వం కేంద్రం నిధులతో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసిందన్నారు. ఇప్పటికే ఐదు కళాశాలలు ప్రారంభిం చారని గుర్తు చేశారు. ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించా లని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రవికుమార్, సుధీర్, సతీష్‌లు పాల్గొన్నారు. ఇదే విషయమై ఈనెల 15న రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించేందుకు నిర్ణయించారు.

దేశ నిర్మాణంలో ఆర్ఎస్ఎస్‌ది అద్వితీయ పాత్ర


మాట్లాడుతున్న జగన్నాథం

బెలగాం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దేశ నిర్మాణంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) అద్వితీయమైన పాత్ర పోషిస్తోందని ఇతిహాస సంకలన సమితి విభాగ్ సంయోజక్ కొల్లు జగన్నాథం అన్నారు. శనివారం ఆర్ఎస్ఎస్ శతాబ్ది వేడుకలను స్థానిక జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్నాథం మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ఆశయాలను అణచివేయడానికి ఎన్నో కుట్రలు జరిగాయన్నారు. ఆర్ఎస్ఎస్ ఎన్నో సవాళ్లను ఎదుర్కొని 100 ఏళ్ల పూర్తి చేసుకుందని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, డాక్టర్ డి.రామ్మోహన్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల పరిశీలన

సాలూరు రూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆధీనంలో నడుస్తున్న వివిధ మేనేజ్‌మెంట్ల పాఠశాలలను ఎంఈవోలు, క్లస్టర్ హెచ్ఎంలు శనివారం పరిశీలించారు. కురుపాం తరహా ఘటనలు జిల్లాలో పునరావృతం కాకుండా నిరోధించడానికి కలెక్టర్ ప్రభాకరరెడ్డి ఆదేశాల మేరకు వీరు పాఠశాలలను సందర్శించారు. గురుకులాలు, ఆశ్రమ పాఠశాలల్లో తాగునీటి వనరులు, తాగునీటి ట్యాంక్ శుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, కిచెన్ షెడ్, వంట సరుకులు నిల్వ ప్రదేశం, వంట పాత్రల శుభ్రత, మురుగు నీరు బయటకు పోవడానికి ఏర్పాట్లు, ఆర్వో ప్లాంట్లు, టీఎంఎఫ్ స్టాక్ అంశాలను వారు పరిశీలించారు.

ఆదమరిచారో కాలువలోకే..

- ప్రమాదకరంగా భోగాపురంలో హరిజన వీధికి వెళ్లే సీసీ రోడ్డు


ప్రమాదకరంగా ఉన్న సీసీ రోడ్డు

భోగాపురం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): భోగాపురం పంచాయతీ మెయిన్ రోడ్డు నుంచి చిన్న వీధి, హరిజన వీధికి వెళ్లే సీసీ రోడ్డు ప్రమాదకరంగా ఉంది. సీసీ రోడ్డు పక్కనే పంట కాలువ ఉంది. ఈ కాలువ కారణంగా సీసీ రోడ్డు కింద నుంచి మట్టి కరిగిపోతూ నీటి ప్రవాహంలో కొట్టుకుపోతుంది. అలాగే ఈ రోడ్డు పక్కన ఎటువంటి రక్షణ వలయం లేదు. దీంతో అటువైపుగా వెళ్లేవారు ఏమాత్రం ఆదమరిచినా పంట కాలువలో పడే ప్రమాదం ఉంది. గతంలో ఓ వ్యక్తి మద్యం మత్తులో ఈ రోడ్డు గుండా నడుచుకుంటూ వెళ్తా కాలువలో పడి మృతిచెందాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సీసీ రోడ్డుకు పంట కాలువకు మధ్య రక్షణ వలయం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

జిందాల్ భూముల్లో ఉద్రిక్త పరిస్థితులు


పోలీసుల రోప్‌ను నెట్టుకువస్తున్న జిందాల్ నిర్వాసితులు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జిందాల్ భూముల్లో శనివారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. జిందాల్ బాధిత ప్రాంతమైన కిల్తంపాలెం పంచాయతీ కొత్తఅడ్డతీగ గ్రామానికి మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, ప్రగతిశీల మహిళ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మి, కేంద్ర ప్రభుత్వ మాజీ సలహాదారు మహాదేవ్‌లు వస్తున్నారని తెలుసుకుని సీఐ నారాయణ మూర్తి ఆధ్వర్యంలో బలగాలను ఏర్పాటుచేశారు. దీంతో గ్రామానికి వచ్చిన వీరిని దారిలో అడ్డుకున్నారు. గ్రామంలో సభ పెట్టడానికి అనుమతులు లేవని పేర్కొన్నారు. తాము సభకు రాలేదని ఒక కుటుంబాన్ని కలిసి భోజనం చేయడానికి వెళ్తున్నామని చెప్పినా ఎస్ఐ చంద్రశేఖర్ ఒప్పుకోలేదు. 'మీరు రాజ్యాంగ ఉల్లంఘన చేస్తున్నారు. సెక్షన్-30 పేరుతో భయపెడుతున్నారు. మా హక్కులు, ప్రజల హక్కులు హరిస్తున్న మీరు కోర్టులో కేసులు ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలి' అని వారు పోలీసులను హెచ్చరించారు.

ఎమ్మెల్సీ బైఠాయింపు


జాతీయ రహదారిపై బైఠాయించిన ఎమ్మెల్సీ రఘురాజు

కొత్త అడ్డతీగ వెళ్తున్న ప్రజాసంఘాల నాయకులను అడ్డుకున్నారని తెలుసుకున్న ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఈ గ్రామానికి వెళ్తుండగా.. ఈ గ్రామ జంక్షన్ వద్ద పోలీసులు ఆయన్ని అడ్డుకున్నారు. పోలీసు వాహనాన్ని ఆయన వాహనానికి అడ్డుగా పెట్టి వెళ్లకుండా చేశారు. దీంతో ఆయన అరగంటపాటు జాతీయ రహదారిపై బైఠాయిం చి నిరసన తెలిపారు. ఇదే విషయాన్ని ఆయన ఎస్పీకి ఫోన్‌లో తెలియజేశారు. దీంతో ఎస్పీ.. గ్రామంలోకి వెళ్లే ఏర్పాటుచేస్తామని చెప్పడంతో ఆయన తన వాహనం దగ్గరకు చేరుకు న్నారు. ఎమ్మెల్సీని పోలీసులు అడ్డగించారని తెలియడంతో నిరసన దీక్షలో ఉన్నవారు అక్కడకు బయలుదేరారు. ఈ సమయంలో పోలీసులు వారిని రోప్ వేసి అడ్డుకున్నారు. మహిళలు రోప్‌ను నెట్టుకుంటూ ముందుకు కదిలారు. ఈ సమయంలో ఎమ్మెల్సీ ఫోన్ చేయడంతో వారు వెనుదిరిగారు. ప్రజల హక్కులను కాలరాయడం, తనను అడ్డుకోవడంపై శాసనమండలిలో ప్రస్తావించడంతో పాటు హక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తానని ఎమ్మెల్సీ అన్నారు.

బొత్స మాటల్లో వాస్తవం లేదు

- ఎమ్మెల్యే కళా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా

రాజాం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ.. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఏదంటే అది తబలా కొట్టడమే కనిపిస్తుందని.. ఆయన మాటల్లో వాస్తవం లేదని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు విమర్శించారు. శనివారం రాజాం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాటు ఉన్నతమైన పదవిలో ఉండి జిల్లాకు ఏమి వెలగబెట్టారని కళా ప్రశ్నించారు. ఏపీలో అభివృద్ధికి నిరోధక శక్తులా మారుతున్న జగన్‌రెడ్డి ఐదేళ్లలో రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి చేశారో చెప్పాలని కళా ప్రశ్నించారు. గతంలో సారా తాగి చాలామంది చనిపోయారని.. అప్పుడు పరామర్శకు రాని జగన్ ఇప్పుడు రావడం విడ్డూరంగా ఉందన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం


ప్రమాద బీమా చెక్కు పంపిణీ చేస్తున్న రాజాం ఎమ్మెల్యే కోండ్రు

వంగర, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా టీడీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన టీడీపీ కార్యాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. అలాగే ఇటీవల మృతిచెందిన ఎం.సీతారాంపురం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నీలకంఠేశ్వరరావు కుటుంబానికి రూ.5లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేశారు. టీడీపీ నాయకులు బొత్స వాసుదేవరావు నాయుడు, పైల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు దేవాలయాలు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను దేవాలయాలుగా భావించాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఎస్.కోట గ్రంథాలయంలో చదివి డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులు సాధించిన బొడ్డేటి సంతోష్‌కుమార్, పల్లె శ్రావణిలను ఆయన శనివారం అదే గ్రంథాలయం వద్ద సత్కరించారు. లైబ్రేరియన్ శ్రీధర్‌ను అభినందించారు. అలాగే ఐదుగురు యువకులు కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన విషయాన్ని గుర్తుచేశారు.

మాజీ జడ్పీటీసీ సభ్యుడి మృతి

జామి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): జామి మాజీ జడ్పీటీసీ సభ్యుడు బండారు పెదబాబు మరణం తీరని లోటని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం వేకువజామున పెదబాబు గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మంత్రి.. పెదబాబు పార్థివ దేహాన్ని సందర్శించి, సంతాపం తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆయన చేసిన సేవలను మంత్రి గుర్తు చేసుకున్నారు. పెదబాబు మృతికి ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్ సంతాపం తెలిపారు.

పేదలకు అండగా ప్రభుత్వం

- మంత్రి శ్రీనివాస్


చెక్కులను అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్

దత్తిరాజేరు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. గజపతినగరంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఆయన దత్తిరాజేరు మండలానికి చెందిన ఇద్దరికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. మానాపురం గ్రామానికి చెందిన పత్తికాయల సూరమ్మకు రూ.60వేలు, గంట జ్యోతికి రూ.లక్షా 6వేలు విలువ గల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు చప్ప చంద్రశేఖర్, మాజీ మండల అధ్యక్షుడు బోడసింగు సత్తిబాబు, గేదెల రామసత్యం తదితరులు పాల్గొన్నారు.

రేపు చలో విజయవాడ


విద్యుత్ శాఖ ఈఈ త్రినాథ్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 13న చలో విజయ వాడ మహాధర్నా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి విజయనగరం, పార్వతీపురం-మన్యం సర్కిల్ నుంచి వందలాది మంది ఉద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్, కన్వీనర్లు సురగాల లక్ష్మణ్, బండారు రాజేష్‌కుమార్‌లు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం దాసన్నపేట విద్యుత్ భవనంలో ఈఈ పి.త్రినాథ్ రావును కలిసి, వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. ఈనెల 13న చలో విజయవాడ, 14న వర్క్ టూ రూల్, 15 నుంచి నిరవధిక సమ్మెకు సిద్ధమవుతున్నట్టు తెలిపారు. విద్యుత్ ఉద్యోగులకు, పెన్షనర్లకు, వారిపై ఆధారపడే కుటుంబ సభ్యులకు నగదు లేని వైద్య సదుపాయాలు అమలు చేయాలని కోరారు. 1999 ఫిబ్రవరి 1 నుంచి 2004 ఆగస్టు 31 మధ్య విద్యుత్ సంస్థల నియమించిన ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలు వలే జీపీఎఫ్, పాత పెన్షన్ విధానాన్ని వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే తమ సమస్యలపై స్పందించి, ట్రాన్స్ కో మేనేజ్‌మెంట్, విద్యుత్ ఉద్యోగుల జేఏసీతో చర్చలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతినిధులు పి.అప్పలస్వామి నాయుడు, నిర్మలామూర్తి, ఆర్.అప్పలనాయుడు, సత్యనారాయణ, సీతారామరాజు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేణుగోపాల్


మాట్లాడుతున్న వేణుగోపాల్

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): మోదీ నాయకత్వం లో దేశాభివృద్ధి జరుగుతుందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పైడి వేణుగోపాల్ అన్నారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆత్మనిర్భర్ భారత్ జిల్లా కార్యశాల సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట స్వదేశీ- ఇంటింటా స్వదేశీ.. ఇది కేవలం నినాదం మాత్రమే కాదని దేశ స్వయం సమృద్ధి, సుసంపన్నత వైపు నడిపించే తారక మంత్రమన్నారు. అనంతరం దీనిపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఉప్పలపాటి రాజేష్‌వర్మ, పార్లమెంట్ కన్వీనరు లక్ష్మీనరసింహం, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆర్యవైశ్య సంఘం కార్పొరేషన్ డైరక్టర్ కుసుమంచి సుబ్బారావు, ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ఇరిగేషన్ బోర్డు డైరక్టర్ కోటగిరి నారాయణరావు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సవాల తీరుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించాలి


మాట్లాడుతున్న భీశెట్టి బాబ్జీ

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన విజయనగరం ఉత్సవాలు జరిగిన తీరు, నిర్వహించిన అధికారుల ఆలోచనలు, జరిగిన పొరపాట్లపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ రామసుందర్‌రెడ్డిలు వెంటనే అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని జిల్లా పౌర వేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విజయనగరంలోని తన స్వగృహంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల అధికారులు విరాళాల కోసం ఒత్తిడి చేశారని ఆరోపణలు ఉన్నాయన్నారు. వీటిన్నంటిపై అఖిలపక్షం నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో ప్రతినిధు లు ఎం.తిరుపతిరావు, గోపాలరావు, శివప్రసాద్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజేపై దాడి యత్నాన్ని ఖండించాలి

వేపాడ, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడి యత్నాన్ని ప్రతిఒక్కరూ ఖండించాలని సీపీఎం జిల్లా నాయకుడు చల్లా జగన్ అన్నారు. పలు దళిత సంఘాల నాయకుల సారథ్యంలో వేపాడలో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ల సహకారంతో అరాచక మూకలు రెచ్చిపోతున్నాయని.. దేశపౌరులు ఈ దాడులను ఖండించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు మండల నాయకుడు దేబారిక కిరణ్, దబ్బిరాజుపేట మాజీ సర్పంచ్ అప్పలనాయుడు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో విస్తృత తనిఖీలు


రాజాం: మద్యం దుకాణంలో తనిఖీలు నిర్వహిస్తున్న ఎక్సైజ్ అధికారులు

రాజాం, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమలులోకి వచ్చిన నేపథ్యంలో దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్టు రాజాం ఎక్సైజ్ సీఐ ఆర్.జైభీమ్ తెలిపారు. శనివారం రాజాం పట్టణంలోని బార్‌లను, మద్యం దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం నిల్వలను పరిశీలించి, నమూనాలను అక్కడికక్కడే ప్రాథమికంగా పరీక్షించామన్నారు. వాటిని తర్వాత రసాయన విశ్లేషణ నిమిత్తం విశాఖపట్నంలో గల ఎక్సైజ్ లేబరేటరీకి పంపిస్తామని తెలిపారు. రాష్ట్ర బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా సరఫరా అవుతున్న మద్యం పూర్తిగా ప్రభుత్వ నాణ్యతా ప్రమాణాలకు లోబడి సురక్షితంగా ఉన్నట్టుగా ధృవీకరించామని తెలిపారు. మద్యం నాణ్యతకు సంబంధించిన ఫిర్యాదులు, సమస్యలను టోల్‌ఫ్రీ నెంబరు 14105కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ఎస్ఐ జి.మాన్యాలు, సిబ్బంది పాల్గొన్నారు. ● మెరకముడిదాం: కల్తీ మద్యం గుర్తింపునకు మండలంలోని మద్యం దుకాణాలను చీపురుపల్లి ఎక్సైజ్ సీఐ జి.గిరీష్, ఎస్ఐ ఎం.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శనివారం తనిఖీలు నిర్వహించారు. ● సంతకవిటి: సీఐ జైభీమ్ సూచనలతో రాజాం ఎక్సైజ్ ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది మండలంలోని సంతకవిటి, సురవరం మల్లయ్యపేట జంక్షన్, తమరాం, గుళ్లసీతారాంపురంలో మద్యం దుకాణాలను తనిఖీ చేశారు. ● భోగాపురం: మండలంలోని భోగాపురం, రెడ్డికంచేరు, సవరవల్లి గ్రామాల్లో గల మద్యం షాపుల్లో జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ స్టేషన్ సిబ్బంది శనివారం తనిఖీలు నిర్వహించారు. మద్యం సేంపిల్స్‌ను పరిశీలించారు. ఎక్సైజ్ సీఐ రవికుమార్, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఇందిరాదేవి, ఎస్ఐ చంద్రమోహన్, సిబ్బంది పాల్గొన్నారు. ● నెల్లిమర్ల / గుర్ల: నెల్లిమర్ల, గుర్ల మండలాల్లో ఉన్న 11 మద్యం షాపులను గత రెండు రోజులుగా తనిఖీలు నిర్వహించి, మద్యం నిల్వలను పరిశీలించినట్టు నెల్లిమర్ల ఎక్సైజ్ సీఐ వెంకటరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్‌డ్ మద్యం దుకాణాల్లో అమ్ముతున్న మద్యం అన్ని ప్రామాణిక పద్ధతులను అనుసరించి తయారు చేసిందని, నెల్లిమర్ల ఐఎంఎల్ డిపో నుంచి సరఫరా చేసిందని ఆయన స్పష్టం చేశారు.

పిడుగు పాటుతో రైతు మృతి


నాయుడు (ఫైల్)

రేగిడి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): పిడుగు పాటుతో రైతు మృతిచెందిన ఘటన మండలంలోని రెడ్డిపేట గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెడ్డిపేటకు చెందిన కొవగాన నాయుడు(45) అనే రైతు గ్రామ సమీపంలో జొన్నపిక్కలు ఎండబెట్టాడు. శనివారం చిన్నపాటి వర్షం పడడంతో జొన్నపిక్కలు కుప్పపెట్టేందుకు తోటి రైతు నడిపల్లి ధనంజయ్‌తో వెళ్లాడు. కుప్పపెట్టిన అనంతరం ఎవరి దారిలో వారు వెళ్తుండగా ఒక్కసారిగా భీకర శబ్దంతో పిడుగు పడింది. దీంతో నాయుడు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడికక్కడే మృతిచెందాడు. పిడుగు పడిన ప్రాంతానికి ధనంజయ్ కొద్దిదూరంలో ఉండడంతో ప్రాణాపాయం తప్పింది. నాయుడు వ్యవసాయంతో పాటు ఆటో కూడా నడుపుతుంటాడు. ఈయనకు భార్య సుగుణ, పిల్లలు రాధిక, లావణ్య ఉన్నారు. కుటుంబ పెద్ద మృతిచెందడంతో ఆ కుటుంబం బోరున విలపిస్తోంది. పంచాయతీ కార్యదర్శి గోపాల్‌నాయుడు పిడుగుపాటు సమాచారాన్ని రేగిడి పోలీస్‌స్టేషన్, రెవెన్యూ వర్గాలకు అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజాం తరలించారు. రేగిడి పోలీసులు కేసు నమోదు చేశారు.

పాము కాటుతో మహిళ..

సంతకవిటి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): సిరిపురం గ్రామానికి చెందిన గొర్లె దమయంతి(50) పాముకాటుతో శుక్రవారం మృతిచెందింది. ఆమె శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లగా, గుర్తు తెలియని పాము ఎడమ కాలుపై కాటు వేసింది. భర్త తారకేశ్వరరావుకు ఫోన్ చేయగా, వెంటనే ఆయన వచ్చారు. స్పృహ కోల్పోయి కింద పడిపోయిన ఆమెను పొందూరు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అయితే అప్పటికే ఆమె మృతిచెందింది. ఈమెకు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం మృతుదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్టు ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపారు.

యువతి ఆత్మహత్య

సీతానగరం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని పెదభోగిలి గ్రామ సచివాలయంలో ఎంఎల్‌హెచ్‌పీగా పనిచేస్తున్న చింతాడ సంధ్య(25) అనే యువతి ఆత్మహత్యకు పాల్పడి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఈ ఘటనకు సంబంధించి ఎస్ఐ రాజేశ్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదంకలాం గ్రామానికి చెందిన సంధ్యకు పెళ్లి చేసేందుకు తల్లి సంబంధాలు చూస్తుంటే.. ఆమె నిరాకరించింది. తనకు పెళ్లి చేసుకునే ఉద్దేశం లేదని చెబుతూ ఈనెల 7న సీతానగరం రైల్వేస్టేషన్ సమీపంలో పురుగు మందు తాగింది. అప్పటి నుంచి విశాఖలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో సంధ్య చికిత్స పొందుతూ శనివారం సాయంత్రం మృతి చెందింది. తల్లి మీరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

దాడి ఘటనలో వ్యక్తి మృతి

కురుపాం, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): వరి చేనును మేకలు తిన్నాయనే కోపంతో ఓ వ్యక్తి.. మేకల కాపరితో పాటు ఆయన తండ్రిపై దాడి చేశాడు. ఈ దాడిలో మేకల కాపరి తండ్రి మృతిచెందాడు. ఈ ఘటన శనివారం కురుపాంలో చోటుచేసుకుంది. దీనిపై కురుపాం ఎస్ఐ పి.నారాయణరావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. వరిచేనును మేకలు తినేశాయని కురుపాం పంచాయతీ హుకుంపేట గ్రామానికి చెందిన రాయఘడ నల్లన్న దొర.. మేదరవీధికి చెందిన మేకల కాపరి రాయఘడ రాజుతో ఘర్షణ పడ్డాడు. ఆ ఘర్షణలో రాజు కింద పడిపోయాడు. అయితే అక్కడే ఉన్న రాజు తండ్రి పిల్లి రాములుపై కూడా నల్లన్న దొర దాడికి పాల్పడ్డాడు. రాములుకు అతడు బలంగా కొట్టడంతో కిందపడిపోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు 108 వాహనం కోసం ఫోన్ చేసినప్పటికీ అది అందుబాటులో లేకపోవడంతో సైకిల్‌పై రాములును స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాములు మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఎస్ఐ కేసు నమోదు చేశారు.

చీపురుపల్లిలో చోరీ

- పది తులాల బంగారం, కిలోన్నర వెండి, రూ.2.5లక్షల అపహరణ


జాగిలాల సహాయంతో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

చీపురుపల్లి, అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): చీపురుపల్లి పట్టణంలోని ఆంజనేయ పురంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఘటనలో పది తులాల బంగా రం, కిలోన్నర వెండి, రూ.2.5 లక్షలు చోరీకి గురయ్యాయి. వివరాలు ఇలా ఉన్నా యి. ఆంజనేయపురంలోని వంగపల్లిపేట రోడ్డులో ఒమ్మి సురేష్ అనే ఉపాధ్యాయుడు నివాసం ఉంటున్నారు. శుక్రవారం మధ్యాహ్నం ఆయన ఇంటికి తాళం వేసి, తన భార్యతో కలిసి రాజాం సమీపంలోని డోలపేటలో ఓ వివాహ కార్యక్రమానికి వెళ్లారు. అదే రోజున రాత్రి సుమారు ఒంటి గంట సమయంలో తిరిగి ఇంటికి చేరుకున్నారు. ఇంట్లోకి వెళ్లి చూడగా.. హాల్లోని కిటికీకి ఉన్న ఇనుప చట్రం ఊడి ఉండడాన్ని గమనించారు. ఇంట్లో ఎవరో ఉన్నారని అనుమానించిన ఆయన లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. లోపలి గదికి గడియ పెట్టి ఉండడంతో, అనుమానం మరింత బలపడింది. వెంటనే సమీపంలో ఉన్న మిత్రులు, సోదరునికి సమాచారం అందించారు. వారు వచ్చిన తర్వాత ఇంటి వెనుక వైపునకు వెళ్లేందుకు ప్రయత్నించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే అలికిడి కావడంతో దొంగలు ఇంటి పెరటివైపున ద్వారం తెరుచుకుని ప్రహరీ దూకి పరారయ్యారు. సమాచారం అందుకున్న ఎస్ఐ దామోదరరావు ఇంటి పరిసరాలను పరిశీలించారు. విజయనగరం నుంచి క్లూస్ టీం వచ్చి, పరిశీలించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం సీసాల స్వాధీనం

గంట్యాడ అక్టోబరు 11(ఆంధ్రజ్యోతి): నీలావతి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సియాదుల గౌరి నుంచి 480 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గౌరి కొటారుబిల్లిలో ఉన్న షాపు నుంచి మద్యం సీసాలను తీసుకుని నీలావతిలో విక్రయిసున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడకు వెళ్లి పరిశీలించారు. అతని వద్ద నుంచి 480 మద్యం సీసాలతో పాటు రూ.31వేలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు.

గిరిజన విద్యాశాఖ గాడిలో పడేనా?

(5వ పేజీ తరువాయి)

అవసరం ఉంది. గిరిజన విద్యాలయాల్లో సక్రమంగా మెనూ అమలు చేయడంతో పాటు అన్ని మౌలిక వసతులు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అనారోగ్యంతో బాధపడే విద్యార్థులను ఇళ్లకు పంపించవద్దని, వారిని స్థానిక ఆస్పత్రులకు తీసుకెళ్లి చూపించాలని ప్రజాప్రతినిధులతో పాటు ఉన్నతాధికారులు ఎన్నిసార్లు చెప్పినా సంబంధిత పాఠశాలల సిబ్బంది పట్టించుకోవడం లేదు. తల్లిదండ్రులు ఒప్పుకోవడం లేదని చెప్పి పిల్లలను వార్డెన్లు వారి ఇళ్లకు పంపించేస్తున్నారు. అక్కడ సరైన వైద్యం లేక మృత్యువాత పడుతున్న పరిస్థితి పార్వతీపురం ఐటీడీఏలో కొన్ని దశాబ్దాలుగా ఉంది. ఇటువంటి పరిస్థితి మార్చే విధంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీడీ విజయశాంతి తగు చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

సమాచార లోపం..

గిరిజన విద్యాలయాలు, వసతి గృహాల్లో ఏదైనా సంఘటన జరిగితే ఆ విషయాన్ని సంబంధిత సిబ్బంది ఉన్నతాధికారులకు చెప్పడం లేదు. అధికారులకు చెబితే ఏమవుతుందోనని భయపడి సమాచారాన్ని దాచేస్తున్నారు. విషయం పెద్దదైన తర్వాత తలలు పట్టుకొని ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చే విధంగా వ్యవహరిస్తున్నారు. సమస్య ఏదైనా, ఎటువంటిదైనా ముందుగా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకొని వస్తే వెంటనే దానిని పరిష్కరించేందుకు వీలుంటుంది. అలా కాకుండా సమస్య జటిలమైన తర్వాత ఉన్నతాధికారులకు చెప్పడం వల్ల ప్రయోజనం ఉండదు. ఇప్పటికైనా ఈ పరిస్థితి మారాలి.

వైద్యం ఎలా?

(5వ పేజీ తరువాయి)

చేపట్టలేదు. దీంతో ప్రతి ఆస్పత్రిలో ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని వైద్యవిధాన పరిషత్‌లోని ఈ ఆస్పత్రుల్లో 350 మంది సిబ్బంది అవసరం. కానీ ఉన్నది కేవలం 298 మంది మాత్రమే. అందులోనూ కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ సిబ్బంది మాత్రమే ఉన్నారు. రెగ్యులర్ సిబ్బంది చాలా తక్కువగా ఉన్నారు. రేడియోగ్రాఫర్, సూపర్‌వైజర్, ఫార్మసీ సూపర్‌వైజర్ గ్రేడ్-1, గ్రేడ్-2, థియేటర్ అసిస్టెంట్, ల్యాబ్ టెక్నీషియన్, డార్క్ రూమ్ అసిస్టెంట్, మెడిసిన్, బయో మెడికల్ ఇంజనీర్, థెరపిస్టు, ల్యాబ్ అటెండెంట్, రికార్డ్ అసిస్టెంట్స్ ఆఫీస్ అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ వంటి పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు..

ఇవి పేరుకే 24 గంటల ఆస్పత్రులు కానీ.. సాయంత్రం 4 గంటల తరువాత వైద్యసేవలు అందడం గగనమే. అత్యవసర, అనారోగ్య సమయాల్లో రాత్రిపూట వైద్యసేవల కోసం వచ్చేవారికి చుక్కలు కనిపిస్తున్నాయి. అక్కడ పలకరించేవారుండరు. వీలైనంత వరకూ రిఫరల్‌కే అక్కడ సిబ్బంది మొగ్గుచూపుతున్నారు. సిబ్బంది, వైద్యులు ఇతర ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. కొందరు వైద్యులు ఓపీ చూశాక సమీక్షలు, సమావేశాల పేరిట జిల్లా కేంద్రాలకు వెళ్తున్నారు. ఫీల్డ్ విధులకు కూడా వెళుతుంటారు. స్థానికంగా నివాసముండే వారు చాలా తక్కువ. అత్యవసర సమయాల్లో వైద్యులు అందుబాటులో ఉండక రోగులు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది.

పాఠశాలను తనిఖీ చేసిన పీవో

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): దుడ్డుకల్లు, రేగిడి, ధర జమ్మ, తిక్కబాయి తదితర పాఠశాలలను శనివారం పార్వతీపురం ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి తనిఖీ చేశారు. పాఠశాలల్లో పారిశుధ్యం, రక్షితనీటిపై ఆరా తీశారు. విద్యార్థుల భోజనం మెనూపై విద్యార్థులలో మాట్లాడారు. విద్యార్థుల ఆరోగ్యంపపై జాగ్రత్త వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఎలాంటి అనారోగ్య సమస్య వచ్చినా సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

అన్నప్రసాద మండపానికి రూ.లక్ష విరాళం

సాలూరు, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయ అన్నప్రసాద మండపం నిర్మాణానికి స్థానిక దీప్తి పాఠశాలకు చెందిన 2005 బ్యాచ్‌కు విద్యార్థులు రూ.లక్ష విరాళం అందజేశారు. కాళ్ల చైతన్య ఆధ్వర్యంలో ఆ మొత్తాన్ని శనివారం ఆలయ కమిటీ అధ్యక్షుడు కేతల సంతోష్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎ.ఉమామహేశ్వరరావు, జర్జపు నాయుడు, హరి, గురుస్వామి, విజయగురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపును ఉపసంహరించుకోండి

పాలకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి) అసెంబ్లీలో ప్రవేశపెట్టిన పని గంటల పెంపు బిల్లును ఉపసంహరించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తోట జీవన్న డిమాండ్ చేశారు. 13 గంటల పనిదినాన్ని వ్యతిరేకిస్తూ రెడ్‌స్టార్ కమిటీ వేసిన కరపత్రాన్ని శనివారం విడుదల చేశారు. కార్య క్రమంలో సిపిఐ రెడ్‌స్టార్ జిల్లా కార్యవర్గ సభ్యులు గరుగుబిల్లి సూరయ్య, పత్తిక మోహన్‌రావు, బిడ్డిక రామూర్తి, యువజన సంఘం నాయకులు బి.చిరంజీవి, స్వర్ణకుమారి, కార్మికులు రామన్న, ఆనంద్, రమణ, వెంకట రమణ తదితరులున్నారు.

15న హుండీల లెక్కింపు

గరుగుబిల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్రలో చినతిరుపతిగా ప్రసిద్ధిగాంచిన తోటపల్లి శ్రీవెంకటేశ్వర, కోదండరామస్వామి దేవస్థానాల్లో హుండీల లెక్కింపును ఈ నెల 15న నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో సూర్యనారాయణ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దేవాదాయశాఖ అధికారుల సమక్షంలో హుండీల లెక్కింపు జరుగుతుందన్నారు. లెక్కింపులో పాల్గొనే భక్తులు నియమ నిబంధనల మేరకు వ్యవహరించాలన్నారు.

జీఎస్టీ తగ్గింపుతో మేలు


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ప్రభుత్వ విప్ జగదీశ్వరి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0 పేద, మధ్యతరగతి వర్గాలకు వరమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండల కేం ద్రంలో శనివారం ఆమె జీఎస్టీ సంస్కరణలను వివరించారు. ప్రతి కుటుంబానికి రూ.15 వేల వరకు ఆదా అవుతుందన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ ద్వారా ఆంధ్రప్రదేశ్‌లో డబుల్ బెనిఫిట్స్ సూపర్ సిక్స్, జీఎస్టీ 2.0 సంస్కరణలను తెలిపే కరపత్రాలను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ బి.జ్ఞానప్రసూనాంబ, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ డి.శ్రీనివాస్, జీఎస్‌టీవో తిరుపతి, ఏఈవో కె.విజయకుమారి, నియోజకవర్గ మహిళా కార్యదర్శి వెంపటాపు భారతమ్మ, వర్తక సంఘం అధ్యక్షుడు వెంకటరావు తదితరులున్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే..

●గుమ్మలక్ష్మీపురం: సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆమె ప్రజాదర్బార్ నిర్వహించారు. ఐదు మండలాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. భూ సమస్యలు, పింఛన్లు, రోడ్డు సౌకర్యం తదితర సమస్యలపై ఫిర్యాదు చేశారు. సమస్యలను ఉన్నతాధికారులకు తెలియజేసి వాటిని పరిష్కరిస్తానని జగదీశ్వరి హామీ ఇచ్చారు.

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జయకృష్ణ

పాలకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సబ్ కలెక్టర్ స్వప్నిల్ పవర్ జగన్నాథ్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలో జీఎస్టీ 2.0పై నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. జీఎస్టీ తగ్గింపును ప్రజలు వినియోగించుకోవాలని వారు కోరారు గతంతో పోల్చితే జీఎస్టీ గణనీయంగా తగ్గిందన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు గండి రామినాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కర్నేన అప్పలనాయుడు, ఎంపీపీ బొమ్మాళి భానుసుధాకరరావు, ఎంపీడీవో రంగారావు, వైస్ ఎంపీపీ వాకమూడి అనీల్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి జాడ శ్రీధర్ పాల్గొన్నారు.

వేణునాయుడు కుటుంబానికి పరామర్శ


వేణునాయుడును పరామర్శిస్తున్న ఎమ్మెల్యే

సీతానగరం (బలిజిపేట), అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): బలిజిపేట మండలం పెదపెంకి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు, మండల పార్టీ అధ్యక్షుడు పెంకి వేణునాయుడు కుటుంబాన్ని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శనివారం పరామర్శించారు. ఇటీవల వేణునాయుడు పిన్ని మృతి చెందిన నేపథ్యంలో ఆయన పెదపెంకి గ్రామానికి వెళ్లారు. ఎమ్మెల్యేతో పాటు కొప్పల వెలమ డైరెక్టర్ గొట్టాపు వెంకటనాయుడు, బోను చంద్రమౌళి ఉన్నారు.

సీజేఐపై దాడికి యత్నించడం హేయం


నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘ నేతలు

పాలకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై దాడికి యత్నించడం హేయమైన చర్య అని మన్యం జిల్లా దళిత సంఘాల నాయకులు అన్నారు. సీజేఐపై దాడికి యత్నించడంపై శనివారం పట్టణంలో నిరసన తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ న్యాయమూర్తికే రక్షణ లేనప్పుడు దళిత, గిరిజనులకు రక్షణ ఎక్కడ ఉంటుందని ప్రశ్నించారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోరారు. నిరసన తెలిపిన వారిలో జిల్లా దళిత హక్కుల పరిరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు బత్తిన మోహన్, దళితసంఘాల నేతలు గురుబిల్లి రవికుమార్, రాజ్‌కుమార్, జామి అనీల్ పి.రమేష్, బొమ్మాళి సుధాకర్, అప్పన్న, ఉపేంద్ర, రాయి రామకృష్ణ తదితరులున్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

జియ్యమ్మవలస, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభమైంది. శనివారం అంకవరంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ సమక్షంలో తహసీల్దార్ వై.జయలక్ష్మి రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. మండలంలో 28 రేషన్ షాపులు, 4 డీఆర్ డిపోల పరిధిలో మొత్తం 16,268 డిజిటల్ రేషన్ కార్డులు జారీచేయనున్నారు. కార్యక్రమంలో వట్టిగెడ్డ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ ఎం.సత్యంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

●గరుగుబిల్లి, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ ఉరిటి రామారావు అన్నారు. శనివారం మరుపెంట పంచాయతీలో స్మార్ట్ రేషన్ కార్డులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో కె.రాఘవరావు, ఎ.నారాయణరావు, వై.సూర్యనారాయణ, టి.చంద్రశేఖరరావు, ఎ.స్వామినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ

పార్వతీపురం టౌన్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని 11 మద్యం దుకాణాలు, రెండు బార్‌లను శనివారం ఎక్సైజ్ సీఐ శిరీష తనిఖీ చేశారు. మద్యం నాణ్యతను పరిశీలించారు. మద్యం నమూనాలను సేకరించారు. వాటిని విశాఖలోని ఎక్సైజ్ ల్యాబ్‌కు పంపించనున్నా మన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ సరఫరా చేస్తున్న మద్యం పూర్తి నాణ్యత ప్రమాణాలకు లోబడి ఉందన్నారు. ఇక నుంచి షాపులు, బార్‌ల్లో మద్యం నిల్వలకు సం బంధించి పూర్తి పర్యవేక్షణ ఉంటుందన్నారుమద్యం నాణ్యతకు సంబం ధించి ఫిర్యాదులను ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 14405 తెలియజేయ వచ్చునన్నారు.

●సాలూరు: సాలూరు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లలో శనివారం మద్యం నాణ్యతను ఎక్సైజ్ సీఐ జి.దాసు తనిఖీలు చేశారు. నమూనాలను సేకరించారు. మద్యం నాణ్యతపై ఫిర్యాదులు ఉంటే సాలూరు ఎక్సైజ్ కార్యాలయానికి లేదా టోల్ ఫ్రీ నెంబరు 14405కు ఫిర్యాదు చేయవచ్చునన్నారు.

●పాలకొండ: రాష్ట్రంలో నూతన మద్యం విధానం అమల్లోకి వచ్చినప్పటి నుంచి నాణ్యమైన మద్యాన్ని అందించేందుకు ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ నిబద్ధతతో పనిచేస్తున్నాయని ఎక్సైజ్ ఎస్ఐ వెంకటరాజు అన్నారు. పట్టణంలోని పలు మద్యం దుకాణాలు, బార్లను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మద్యం నమూనాలను సేకరించారు.

●సీతానగరం: సీతానగరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాను శనివారం ఎక్సైజ్ సీఐ డి.పద్మావతి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మద్యం నాణ్యతను పరిశీలించారు. మద్యం నమూనాలను సేకరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇకపై ప్రతి నెలా దుకాణాల్లో మద్యం నాణ్యతను పరిశీలిస్తామన్నారు.

●గుమ్మలక్ష్మీపురం: నూతన మద్యం విధానం ద్వారా నాణ్యమైన మద్యం అందించడమే ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ చర్యలు తీసుకుంటోందని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎస్ఐ పి.శ్రీనివాసరావు అన్నారు. కురుపాం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలను ఆయన శనివారం తనిఖీలు చేశారు. మద్యం నాణ్యతను పరిశీలించారు. మద్యం నమూనాలను సేకరించారు. మద్యం నాణ్యతకు సంబంధించి ఫిర్యాదులను 6302936599 తెలియజేయాలని కోరారు.

మెరుగైన సేవలు అందించాలి

గరుగుబిల్లి, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో 104 వాహనాల ద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా మేనేజర్ ఎస్.కృష్ణ సూచించారు. శనివారం రావివలస ప్రాంతంలో 104 వాహన సేవలను ఆకస్మికంగా ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 104 వాహనంలో రోగులకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలన్నారు. రికార్డుల నిర్వహణతో పాటు మందుల పంపిణీలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

బాలికలు నైపుణ్యం సాధించాలి

భామిని, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): అన్ని రంగాల్లో బాలికలు నైపుణ్యం సాధించాలని ఎంఈవో భాస్కరరావు సూచించారు. శనివారం భామిని కేజీబీవీలో అంతర్జాతీయ బాలికల దినత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీడీపీవో శాంతిభవానీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాగ్యవతి ఉన్నారు.

సందడిగా నందన్న ఉత్సవాలు

భామిని, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో నందన్న ఉత్సవాల సందడి నెలకొంది. గౌరీపౌర్ణమి సందర్భంగా నందన్నను గ్రామాల్లో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. శనివారం భామిని, నేరడి, నులకజోడు తదితర గ్రామాల్లో సందన్న నిమజ్జనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. తొలుత నందన్నను డప్పు వాయిద్యాలు, పగటి వేషాలు, కర్రసాము నడుమ ఊరేగించారు.

●వీరఘట్టం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): వీరఘట్టంలో శనివారం సాయంత్రం నందన్న విగ్ర హాలను ఘనంగా ఊరేగించారు. మహిళలు పెద్దఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు.

ఐటీఐలో మెగా జాబ్‌మేళా రేపు

సాలూరు, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ఈ నెల 13న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసాచా ఓ ప్రకటనలో తెలిపారు. జాబ్ మేళాకు అదాని ఎనర్జీ సొల్యూషన్స్, భగవతి ప్రొడక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, పాటిల్ రైల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, టాటా ఎలక్ట్రానిక్స్ హీరో మోటార్ సైకిల్స్, డిమార్ట్, ఫ్లికార్ట్, అమెజాన్, స్విగ్గీ తదితర కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని వివరించారు. టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ వారిని అర్హత ప్రకారం ఉద్యోగాన్ని కేటాయిస్తారన్నారు. ఐటీఐ పాసైన వారికి అప్రెంటీస్ శిక్షణకు ఆయా కంపెనీలు ఎంపిక చేస్తాయ న్నారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రూ.15 వేల నుంచి 22 వేలు... అప్రెంటీస్ కోసం తీసుకున్న వారికి రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు చెల్లిస్తారన్నారు. కొన్ని కంపెనీలు ఉచిత వసతి, భోజనం సౌకర్యం కూడా కల్పిస్తాయన్నారు. ఆసక్తి గలవారు మేళాకు ఒరిజినల్ సర్టిఫికెట్లు, బయోడేటా తీసుకురావాలని కోరారు.

డీడీని తొలగించడం అన్యాయం

సీతంపేట రూరల్, అక్టోబరు11 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా గిరిజన సంక్షేమశాఖ డీడీ(ఎఫ్ఏసీ)గా విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణిని ఆ బాధ్యతల నుంచి తప్పించడం ఆదివాసీ గిరిజనులను అవమానపరచడమేనని ఆదివాసీ సేవాసొసైటీ సభ్యులు ఎం.రవి, మణిబాబు, బాబురావు పేర్కొన్నారు. శనివారం వారు ఓ ప్రకటన విడుదల చేశారు. ఆదివాసీ తెగకు చెందిన గిరిజన మహిళ గిరిజన సంక్షేమశాఖలో ఏటీడబ్ల్యూవోగా విధులు నిర్వహిస్తూ డీడీగా అదనపు బాధ్యతలు నిర్వహించేవారన్నారు. గిరిజన విద్యారుల యోగక్షేమాలపై నిరంతరం పర్యవేక్షించేవారన్నారు. తక్షణమే కృష్ణవేణిని డీడీ(ఎఫ్ఏసీ)గా కొనసాగించాలన్నారు. లేకుంటే ఆదివాసీలు నిరసన కార్యక్రమాలు చేపడతారని హెచ్చరించారు.

నకిలీ మద్యం తయారీ

పాలకొండ, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం నకిలీ మద్యాన్ని తయారీ చేసి ప్రజల ప్రాణాలను హరిస్తున్నారని ఎమ్మెల్సీ విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి ఆరోపించారు. పట్టణంలో శనివారం వారు విలేక టరులతో మాట్లాడారు. నకిలీ మద్యం తయారీ ఆపాలని సోమవారం వడమలోని ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన చేపడతామన్నారు

ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించండి

బెలగాం, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి: కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయులు సమస్యలను పరిష్కరించాలని ఆప్టా జిల్లా అధ్యక్షుడు చింతాడ రాము డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పీఆర్సీ కమిషన్ నియామకం, ఐఆర్ అమలు, పీఆర్సీ బకాయిలు చెల్లింపు తదితర వాటిని పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయనతో పాటు ఆప్టా జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.